

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

**రోషన్ తుమ్హీసె దునియా**
**రౌనక్ తుమ్హీ జహాన్‌కి**
**పూలోమె పల్‌నె వాలీ, రాణీ హో తుమ్ జహాన్‌కీ**
**సలామత్ రహో! సలామత్ రహో!**

ఇందీవర్ రచించిన ఈ ప్రేయసి వర్ణన గీతంతో ఓ నలభై ఏళ్లపాటు హిందీ చలన చిత్ర సంగీత ప్రపంచాన్ని అప్రతిహితంగా ఏలిన లక్ష్మీకాంత్ ప్యారేలాల్ సంగీత దర్శక జోడీ హిందీ సినీ ప్రపంచంలోకి అడుగుపెట్టింది. 'పారస్మణి' సినిమా చూసినవారు, చూసి మెచ్చిన వారు చాలా తక్కువ. కానీ 'పారస్మణి' సినిమా పేరు తెలియకున్నా ఈ సినిమా పాటలను పాడుకునే వారు ఎంతో మంది 'ఉయ్ మా ఉయ్ మా యెక్యాహోగయా', 'హస్తహువా నూరానీ చెహరా,' 'వోజబ్ యాద్ ఆయే', 'గలిగలి యె బాత్ చలీ తో లోగా క్యాకహేంగే' ఇలా సినిమాలోని ప్రతిపాట సూపర్ హిట్టే. ఈ సినిమా నాయిక మన తెలుగు సినిమాల్లో చెల్లెలుగా, సహాయనటిగా పేరు పొందిన నాయక గీతాంజలి.

ప్రేయసి వర్ణన పాటల గురించి చర్చించే కన్నా ముందు ఒక విషయం ప్రస్తావించుకోవాల్సి ఉంటుంది. లక్ష్మీకాంత్ ప్యారేలాల్ జంట సినీ సంగీత ప్రపంచంలో అడుగు పెట్టినప్పుడు శంకర్ జైకిషన్ సంగీత ప్రపంచాన్ని మకుటంలేని మహారాజుల్లా ఏలుతున్నారు. మరోవైపు నౌషాద్ తన అగ్రస్థానాన్ని పదిలం చేసుకుని మరెవరినీ దగ్గర రానీయటంలేదు. ఎస్.డి.బర్మన్ తన మధురమైన సంగీతంతో తన ప్రత్యేక సామ్రాజ్యాన్ని నిర్మించుకుని సుస్థిరంగా ఉన్నాడు. ఇదే సమయానికి యువ సంగీత దర్శకులు రంగప్రవేశం చేసి తమ ముద్ర వేయాలని, ఈ ప్రపంచంలో తమ కంటూ ఓ గుర్తింపు సంపాదించాలని ప్రయత్నిస్తున్నారు. ఇక్బాల్ ఖురేషీ, కళ్యాణ్‌జీ ఆనంద్‌జీ, ఆర్ డి బర్మన్, సి. అర్జున్ వంటి వారు రంగ ప్రవేశం చేసి గుర్తింపు కోసం తహ తహలాడుతున్నారు. మరోవైపు ఎస్.ఎన్ త్రిపాఠి, చిత్రగుప్త, సి.రామచంద్ర వంటి సంగీత దర్శకులు స్థిరంగా ఎప్పటినుంచో తమ ప్రత్యేకతను నిలుపుకుంటూ వస్తున్నారు. ఇలాంటి పరిస్థితులలో రంగప్రవేశం చేసిన లక్ష్మీకాంత్ ప్యారేలాల్ మొదటి చిత్రంతోటే అత్యద్భుతమైన గుర్తింపు పొందారు. మిగతా వారినందరినీ వెనక్కి నెట్టి అగ్రస్థానం వైపు పరుగులు పెట్టారు. ఒక దశాబ్దం లో వారు రాజ్‌కపూర్ సినీ సామ్రాజ్యంలో శంకర్‌జైకిషన్‌ను పక్కకు నెట్టి, వారి స్థానాల్ని ఆక్రమిస్తారని ఎవ్వరూ ఊహించలేదు. అలాంటి అనూహ్యం, అసంభవం అయిన విషయాన్ని నిజం చేసి చూపిన లక్ష్మీ ప్యారేలు సృజించిన మధురమైన పాట ఇది.

ప్రతి వ్యక్తికీ తను అనుభవించేదే ప్రపంచం. తాను చూస్తున్నదే నిజం. అందుకే ప్రియుడికి తన ప్రేయసే ప్రపంచానికి వెలుతురు అనిపించటంలో ఆశ్చర్యం లేదు. అతిశయోక్తిలేదు. 'నీ వల్లనే ప్రపంచానికి వెలుతురు. నీ వల్లనే ప్రపంచానికి ప్రతిష్ఠ' అని ప్రియుడు అనుకోవటం స్వాభావికం. ఆమె ఎంత సున్నితమైనదంటే, పూలలో పెరిగిందట, ఆమె పూలతోటల రాణి అట. ఆమె సుఖంగా, దీర్ఘకాలం భద్రంగా ఉండమని ప్రియుడు ఆశించటంలో ఆశ్చర్యం లేదు.

ఇదే రొమాంటిక్ భావనను మరింత వ్యక్తిగతం చేసి ప్రకటించాడు కవి హస్రత్ జైపురి. ఇక్కడ గమనించాల్సిందేమిటంటే ప్రియుడు తన వ్యక్తిగత భావనను సార్వజనీనం చేసి సమస్త ప్రపంచానికి అన్వయించి ప్రకటించటం. అయితే, మళ్ళీ ఇతర విషయాలకు వచ్చేసరికి తన భావనను వ్యక్తిగతం చేయటం.

**పూలోంకి రాణి, బహారోంకి మల్లికా**

**తెర ముస్కురానా గజబ్ హోగయా,**

**న దిల్ హోష్ మేహై, న హం హోష్ మే హై**

**నజర్ కా మిలానా గజబ్ హోగయా.**

'ఆర్జూ' సినిమాలో మహమ్మద్ రఫీ అత్యద్భుతంగా పాడిన ఈ పాటలో హస్రత్ జైపురి ప్రియుడితో 'పూలోంకి రాణీ' అనిపించాడు – బహారోంకి మల్లిక. వసంతాలకు రారాణి. ఆమె నవ్వటమే అద్భుతం. ఇక ప్రియుడి హృదయం కానీ అతడు కానీ మైమరచి పోవటంలో ఆశ్చర్యం లేదు. ఆమె కళ్ళు అతడి కళ్లతో కలిస్తే.

ఈ రెండు పాటలు చాలా గొప్పగా ఉంటాయి. అణువణువునా శృంగార భావన చిప్పిల్లుతూంటుంది. నాయికను వర్ణించటంలో చులకన భావంకానీ, తేలికదనం కానీ కనిపించదు. ముఖ్యంగా 'రోషన్ తుమ్హీ సె దునియా' పాట చరణంలో 'దిల్ చాహె టూట్ జాయే, మెరె దిల్ సె యూహి ఖేలో' అనటం, నాయకుడికి ఆమె పట్ల ఉన్న తీవ్రమైన ఆరాధనా భావన కనిపిస్తుంది. నా హృదయం పగిలిపోయినా ఫరవాలేదు, నా హృదయంతో ఆడుకో' అని 'బ్లాంక్ చెక్' ఇచ్చేస్తున్నాడు నాయకుడు. 'ఉరన్ ఖటోలా ' సినిమాలో షకీల్ బదాయుని రాసిన ప్రేమగీతం సరిగ్గా ఇదే భావనను ఇంకా విస్తరించి విపులంగా చెప్తుంది.

**న తూఫాన్ సే ఖేలో, న సాహిల్ సే ఖేలో**

**మెరే పాస్ ఆవో, మేరే దిల్‌సె ఖేలో.**

నాయికను అనవసరమైన ప్రమాదాల వెంట పడద్దంటున్నాడు నాయకుడు. తుఫానులతోటీ, నది ఒడ్డుతోటీ ఆటలాడవద్దంటున్నాడు. అది ప్రాణానికి ప్రమాదం. కాబట్టి తన దగ్గరకు వచ్చి తన హృదయంతో ఆడుకోమంటున్నాడు.

ఇందీవర్ పాటలో ప్రేమ తీవ్రత ఎంత ఉందో, షకీల్ బదాయుని పాటలో ప్రేమ తీవ్రత అంతే ఉంది. దానికి కాస్త చమత్కారం తోడయింది. ఇదే హస్రత్ జైపురి పాటలో ప్రేమ తీవ్రత, చమత్కారాలకు కవిత్వం తోడయింది.

**తెరే హోఠ్ క్యాహై, గులాబీ కవల్ హై**

**యె దో పత్తియా, ప్యార్‌కీ ఇక్ గజల్ హై**

**వొ నాజూక్ లబోంసె, మొహబ్బత్‌కి బాతే**

**హం హీకో సునానా గజబ్ హోగయా.**

ప్రేమ పిచ్చి పరాకాష్టను అతి నాజూకుగా చమత్కారంగా ప్రదర్శిస్తున్నాడు హస్రత్ జైపురి. అతడి ప్రేయసి పెదిమలు, గులాబీ రేకులు 'యె దో పత్తియా' అంటే ఆమె పెదిమలు గులాబీ రేకులు.. కానీ పెదిమలు రెండుంటాయి. పై పెదవి, క్రింది పెదవి. అవి రెండు మృదువైన రేకుల్లా ఉన్నాయి. అవి ప్రేమ గజల్‌ట. ఆ నాజూకు పెదిమలతో అతనికి ప్రేమకబుర్లు వినిపించటం 'అద్భుతం'. కాదా మరి. ఇంకా ప్రేమలో ప్రియుడి ఊహకు పరాకాష్ట షహనాయి సినిమాలో రాజేంద్ర కిషన్ రాసిన ఈ పంక్తులు 'నరుఖ్‌కో జుల్ఫ్ సే పానీ' అనే పాటలోనివి.

**యె నాజూక్ లబ్ హై యా, ఆపస్ మె దో లిప్టే హుహీ కలియా**

ఇవి నాజూకు పెదిమలా, లేక కౌగిలించుకున్న రెండు పూ మొగ్గలా? ఇంతవరకూ ప్రియుడి వర్ణనలో గొప్పతనం ఏమీ లేదనిపిస్తుంది. తరువాత పంక్తిలో ప్రేమ తీవ్రత తెలుస్తుంది.

**జరా ఇన్ కో అలగ్ కర్‌దో, తరన్నుం ఫూట్ జాయేగీ**

ఆమె తన పెదిమలను కొద్దిగా దూరం చేసినా, సంగీతం, అందమైన సుమధురమైన సంగీత విస్ఫోటనమౌతుంది. ఇలా సినీకవులు ఎంతో గొప్పగా, ఔచిత్యభరితంగా, మృదువుగా, గౌరవంగా నాయికను వర్ణించిన తీరు సినిమాలలో నాయికను నాయకుడు ఎంత పవిత్రంగా, ఎంత తీవ్రంగా ప్రేమించేవాడో సృష్టింపచేస్తుంది.

అయితే, మజ్రూహ్ సుల్తాన్‌పురి 'యాదోంకీ బారాత్' సినిమాలో  చురాలియాహై తుం నే జో దిల్‌కో' అనే పాటలో ప్రేయసి వర్ణన చేయలేదుగానీ, నాయకుడితో ప్రేమ ప్రకటనను, ప్రేమ తీవ్రతను, ప్రేమలో పిచ్చిని అత్యద్భుతమైన రీతిలో, అత్యంత కవితాత్మకంగా ప్రకటింపచేశాడు.

**'లహూ జిగర్ క దూంగా, హసీన్ లబోంకి లాలీకో'**

అంతకుముందు తాను మరణించయినా లతలాంటి ఆమె శరీరాన్ని కాపాడతానంటాడు. పెదిమల దగ్గరకు వచ్చేసరికి, తన హృదిలోని రక్తాన్ని ఆమె పెదిమలకు పూసి ఆమె పెదిమలకు ఎర్రదనాన్ని ఆపాదిస్తాడట. మరింత పెంచుతాడట. అద్భుతమైన భావన! ఇలా హిందీ సినిమా పాటలలో గేయ రచయితలు విజృంభించి  సున్నితమైన ప్రేమ భావన, అత్యంత తీవ్రమైన ప్రేమ భావనను అతి సుందరంగా కవితాత్మకంగా ప్రదర్శించారు. సినీ పాటలకు సాహిత్య గ్రంధాన్ని పూయటమేకాదు, సమాజానికి ఉత్తమ ప్రేమను ఆదర్శంగా నిలిపారు. ఈ ప్రేమలో నాయిక వస్తువు కాదు. ఆనందాలందించే గనికాదు. అనుభవించి పారేసే అర్ధంలేని అనామిక కాదు.

**నాజుక్ హో నాజ్ సే భీ, తుం ప్యార్ సే భీ ప్యారీ**
**జీతీ రహో యున్‌హీతుం, మేరీ భి ఉమ్ర్‌లేలో**
**జిస్ దిన్ దువా న మాంగే, హం నే తుమ్హారి జాన్‌కీ**
**సలామత్‌రహో!**

అత్యంత మృదువైన దానికన్న మృదువైనదట ఆమె ప్రేమకన్నా ప్రియమైనది. తన జీవితకాలం కూడా తీసుకుని ఆమెని దీర్ఘకాలం ఆనందంగా బ్రతకమంటున్నాడు. ఆమె  సుఖంగా, సంతోషంగా ఉండాలని భగవంతుడిని ప్రార్ధించని రోజు లేదట.

**ఫిజావోమె ఠండక్, ఘటా పర్ జవానీ**
**తెరేగేసువోంకి బడీ మెహర్‌బానీ**
**హర్ ఏక్ పేచ్ మే సైకడో మైకదేహై**
**తెరా లడ్ ఖడానా గజబ్ హోగయా.**

ప్రకృతిలోని చల్లదనం, మేఘాలకు యవ్వనం ఆమె కురుల వల్లేనట. అంతేకాదు, హర్ ఏక్ పేచ్ మే సైకడో మైకదే హై'. ఆమె జడలోని ప్రతి ముడిలో ఒక మధుశాల ఉందట. అసలు కవులకు ఇలాంటి ఊహలు ఎలా వస్తాయా అనిపిస్తుంది. జడకు ముదులు వేస్తారు. గట్టిగా దట్టించి వేస్తారు. కురులను రెండు పాయలుగా చీల్చి, వాటిని ముడివేస్తారు. అలాంటి ప్రతి ముడిలోనూ వేలకొలది మధుశాలలున్నాయట. ఆ ప్రియుడి పిచ్చిని ఊహిస్తే ఎంతో గొప్ప అనిపిస్తుంది. కానీ ప్రతి జడ ముడిలో వేలకొలది మధుశాలలను ఊహించిన కవి శృంగార రసమయ సృజనాత్మక హృదయానికి జోహార్లు అర్పించాలనిపిస్తుంది. అలా జడ ముడిలో వేలకొలది మధుశాలలను దాచుకున్న ఆమె అడుగులు తడబడటం మన హీరోకి మరింత అద్భుతం అనిపిస్తుందిట.

ఇలాంటి చమత్కార భరితం, కవితాభరితమైన గీతాలు వింటూంటే మరో లోకానికి వెళ్లిన భావన కలుగుతుంది. స్వర్గపుటంచులలో హృదయం నర్తిస్తున్నట్టు అనిపిస్తుంది. ఏమి ఊహలు! ఎంత శృంగారం! ఎంత సున్నితమైన భావనలు! ఇలాంటి ఊహలతో ప్రేమను ప్రదర్శించే సినిమాలు సమాజంలోనూ సున్నితమైన ప్రేమ భావనల బీజాలు నాటుతాయి. సామాన్యులు సైతం కవితలు గ్రహించి ఆనందించేట్టు చేస్తాయి. వారి ఊహలకు రెక్కలనిస్తాయి. అవీ ఔచిత్యాన్ని అనుసరించే రెక్కలు.

మజ్రూహ్, షకీల్, వంటి గేయ రచయితలు ప్రేమ భావనను అత్యద్భుతమైన రీతిలో తమ గేయాలలో ప్రదర్శించారు. ముఖ్యంగా షకీల్ బదాయుని ఆరంభం నుంచీ ప్రేమ భావన తప్ప మరో భావనతో గేయాలు రచించలేదు. మజ్రూహ్ సుల్తాన్‌పురి స్వయంగా విప్లవ భావాలున్నవాడయినా, సినిమా పాటలపై ఆ విప్లవ భావనల ఛాయను కూడా పడనీయలేదు. అదే, సాహిర్ లూధ్యాన్వీ  అవకాశం దొరికినప్పుడల్లా తన ప్రేమ పాటలలో తన హృదయాన్ని ప్రదర్శించాడు. తన సిద్ధాంతాలను ప్రకటించాడు. ఈ ప్రకటనంతా సినీ సందర్భ పరిధిలో ఒదిగి జరిగినా, అది కవి వ్యక్తిగత స్థాయిని దాటి సినీ సందర్భ పరిధిలో ఒదుగుతూ కూడా సార్వజనీనతను సాధించింది అందుకే సినిమా పాట ఈనాడు సమాజంలో 'సాహిత్యం' స్థానాన్ని ఆక్రమించి, సమాజాన్ని అత్యంత తీవ్రమైన స్థాయిలో ప్రభావితం చేయటంలో గేయ రచయితల పాత్ర అత్యధికం అనటం అనృతం కాదు. అనేక సందర్భాలలో మామూలు బాణీలను కూడా తమ చమత్కారభరితమైన గేయ రచన సంవిధానంతో అసాధారణమైన గీతంలా గేయ రచయితలు మలచిన సందర్భాలు కోకొల్లలు. ఆ గేయాలను ప్రతిభావంతులైన గాయనీగాయకులు తరతరాలుగా ప్రభావితం చేయగల మహాద్భుతమైన గీతాలుగా నిలపటం వల్ల ఈనాడు 'కవి' అంటే సినీ గేయరచయిత, రచయిత అంటే సినీ రచయిత మాత్రమే అనే పరిస్థితి వచ్చింది. ఒక రచయితకు గుర్తింపు రావాలంటే సినిమాల్లో పని చేయటం 'గీటు రాయి'గా మారింది.

ప్రేమలో అత్యంత తీవ్రమైన ఉన్మాద స్థాయిని అతి సున్నితంగా, అత్యంత చమత్కారభరితంగా ప్రదర్శించిన ఈ పాటలోని కవితాత్మను గమనిస్తే, బాణీతో సంబంధం లేకున్నా పాటకు తనదైన ప్రత్యేకతను గేయ రచయితలు ఆపాదించటం స్పష్టమవుతుంది.

**నజానే క్యా  హమారే దిల్ కొ తుమ్నే దిల్ నహీ సంఝూ**

**యె శీషా తోడ్  డాలా ప్యార్ కే కాబిల్ నహీ సంఝూ.**

'మొహబ్బత్ జిందగీహై ' సినిమాలో ఓ.పి.నయ్యర్ సంగీత దర్శకత్వంలో ఎస్.హెచ్. బిహారీ సృజించిన చమత్కార ప్రేమ గీతం ఇది. పల్లవి మామూలుగా ఉంటుంది. తన ప్రేమని తిరస్కరిస్తున్న నాయికతో నాయకుడు అంటున్నాడు నా హృదయాన్ని హృదయంగా ఎందుకనో గుర్తించలేదు నువ్వు. దీన్ని ప్రేమార్హంగా భావించక పగలగొట్టావు అంటున్నాడు. ఇక చరణంలో కవి విజృంభిస్తాడు.

**హమారా ప్యార్ దేఖొ, ఔర్ హమారా హోస్‌లా దేఖో**

**మొహబ్బత్ కా జునూన్ హంకో కహాతక్ లేచలా దేఖో**

**తుమ్హీనె జాన్ లేలీ, ఔర్ తుమ్హే కాతిల్ నహీ సంఝూ.**

నా ప్రేమ చూడు ప్రేమపై నాకున్న విశ్వాసం చూడు. ప్రేమ తీవ్రత నన్ను ఏ స్థాయికి తీసుకువెళ్లిందో చూడు. నా ప్రాణం తీసింది నువ్వే. అయినా నిన్ను హంతకురాలిగా నేను భావించటం లేదు. ఇప్పుడు ఈ భావానికి పల్లవిని చేరిస్తే అద్భుతం అనిపిస్తుంది అంటే తన ప్రాణం తీసినామెని హంతకురాలిగా పరిగణించనంత పిచ్చి ప్రేమ ఉన్నా అతడి హృదయాన్ని ఆమె హృదయంగా పరిగణించలేదు. అతడిని ప్రేమార్హంగా భావించలేదు. గొప్ప గాన రచనా సంవిధానం ఇది.

**తడప్ దీ  దీ తొ ఐసే  దీ కె ముష్కిల్ హోగయా జీనా**

**చలాయా తీర్ వో తుమ్నే కె ఛల్నీ హోగయా సీనా**

**ఔర్ ఉస్‌పర్ యే సితంహై,కే, హమే ఘాయల్ నహీ సంఝా**

ఆమె అతడికి ఎంత బాధనిచ్చిందంటే బ్రతకటం దుర్భరమైపోయింది. ఆమె అతడిపై ఎలాంటి బాణాన్ని ప్రయోగించిందంటే, అతడి హృదయం ముక్కలు చెక్కలయిపోయింది. అన్నిటినీ మించిన దౌష్ట్యం ఏమిటంటే, అసలు అతడు గాయపడినట్టుగా కూడా ఆమె పరిగణించటం లేదు. ఇప్పుడీ భావానికి పల్లవిని జోడిస్తే, మొదటి చరణం తరువాత వచ్చే భావానికి విరుద్ధమైన భావం కలుగుతుంది. మొదటి చరణం తరువాత నాయకుడిపై జాలి కలుగుతుంది. రెండవ చరణం తరువాత నాయిక ఉదాసీనతపై, దౌష్ట్యంపై ఆగ్రహం కలుగుతుంది.

**మొహబ్బత్ కా యె జాదూ ఎక్ దిన్ సర్ చడ్ కే బోలేగా**

**హర్ ఎక్ అంధీ, హర్ ఎక్ తుఫాన్ కో దామన్ మే లేలేగా**

**మొహబ్బత్ నే కిసీభీ కాం కో ముష్కిల్ నహీ సంఝా**

ప్రేమ అనే అద్భుతం వాడి నెత్తికెక్కి చెప్తోందట. ఎలాంటి తుఫానులనయినా సుడిగాలుల నయినా ప్రేమ భరిస్తుంది. ఎలాంటి కష్టాన్ని కూడా ప్రేమ కష్టం అనుకోలేదు. ఎలాంటి ప్రతికూల పరిస్థితిలనయినా తట్టుకుని ప్రేమ గెలుస్తుంది అన్న నాయకుడి వ్యాఖ్యానానికి ఇప్పుడు పల్లవిని జోడిస్తే  నాయకుడి ఆత్మవిశ్వాసం ప్రస్ఫుటమవుతుంది. ప్రేమ ఎలాంటి పనిని కూడా కష్టం అనుకోలేదు. ఆమె తన హృదయాన్ని హృదయంగా పరిగణించక పోయినా  ప్రేమార్హంగా భావించకపోయినా పరవాలేదు. అతడి ప్రేమ గెలుస్తుంది. ఇదీ అత్యద్భుతమైన  గేయ రచన సంవిధానం. పాట బాణీ ఓ.పి.నయ్యర్ మామూలు బాణీల స్థాయిలో ఉంటుంది. రఫీ పాడే విధానం అతనికి అలవాటయిన అద్భుతమైన స్థాయిలో ఉంటుంది. వీటికి చమత్కార భరితమైన గేయ రచనను జోడిస్తే మామూలు బాణీ అత్యద్భుతమైన పాటగా ఎదుగుతుంది.

ఇలాంటి చమత్కారమే, అయితే చివరికి ఇంత విప్లవాత్మకమైన భావాలు, నిరసన లేకుండా మరింత సున్నితంగా, మరింత చమత్కారభరితంగా ప్రదర్శించాడు హస్రత్ జైపురి 'ఆయీ మిలన్ కీ బేలా' సినిమాలో 'తో బురా మాన్ గయే' పాటలో.  అద్భుతమైన బాణీ, ఆకర్షణీయమైన ఆర్కెస్ట్రేషన్‌కి, అందంగా వగలు చిలుకుతూ, వంకర్లు తిరుగుతూ, వెక్కిరిస్తూ పాడే రఫీ గొంతు తోడయి ఈ పాటను అత్యద్భుతమైన రొమాంటిక్ చమత్కార వ్యంగ్య గీతాల్లో అగ్రస్థానంలో నిలుపుతుంది.

**బురా మాన్‌గయే**

**ప్యార్ ఆంఖోసె జతాయా, తౌ బురామాన్‌గయే**

**హాల్– ఎ– దిల్ హమ్నె సునాయా, తౌ బురామాన్‌గయే.**

నాయికకు కోపం వచ్చిందట. అఫెండ్ అయింది ఎందుకంటే, నాయకుడు ఆమెవైపు ప్రేమ నిండిన కళ్లతో చుశాడట. ఆమెకు తన హృదయ వేదనను నివేదించుకున్నాడట. అది ఆమెకు నచ్చలేదట.

**అప్ని గజ్రేకి హర్ ఎక్ ఫూల్ కి తారీఫ్ సునీ**

**జఖ్మే – ఎ –దిల్ హమ్నె  దిఖాయా తౌ బురామాన్‌గయే.**

ఆమె కురులలోని పూలను పొగిడినంతసేపు హాయిగా, ఆనందంగా విన్నదట. కానీ గాయపడిన తన హృదయాన్ని చూపగానే కోపం వచ్చేసిందట ఆమెకు. ఎంత అందమైన ఫిర్యాదు. సున్నితమే కాదు చమత్కార భరితంగా తన ప్రేమను ఆమె ఉపేక్షను విమర్శిస్తున్నాడు. పాట వింటూంటే పెదిమలపై చిరునవ్వు నిలుస్తుంది. మనస్సులో అందమైన వేదనా వీచిక కదులుతుంది హాయిగా!

**వోతౌ హర్ రోజ్ రులాతే హై ఘటావోంకి తర్హా**

**హమ్నె ఎక్ రోజ్ రులాయాతో బురా మాన్ గయే**

ఆమె ప్రతి రోజూ అతడిని ఏడిపిస్తుంది.అతడికి కోపం రాదు.. కానీ అతడు ఒకరోజు ఆమెని ఏడ్పించగానే ఆమెకు కోపం వచ్చేసింది.

**సిర్ఫ్ ఇత్నీసి ఖతాపర్ హమే దుష్మన్ జానా**

**సర్ కో కద్మోమె ఝుకాయా తొ బురా మాన్ గయే**

అతడు చిన్న పొరపాటు చేసినందుకు ఆమె అతడిని శత్రువులా పరిగణించి కోపం ప్రదర్శిస్తోంది. ఇంతకీ అతడు చేసిన పొరపాటేమిటంటే, ఆమెకు పాదాభివందనం చేశాడు. ఆమె కాళ్ల వద్ద తన తలను వంచాడు. అదీ ఆమె కోపానికి కారణం. అత్యద్భుతమైన భావన కలుగుతుందీ పాటలు వింటూంటే. పాటల్లో గేయరచయితలు ప్రదర్శించిన చమత్కారం శృంగారం వంటి భావనలను అర్థం చేసుకుంటే మనసులో కలిగే రసప్రవాహం బ్రహ్మానందానుభూతిని కలిగిస్తుంది. అసలు బ్రహ్మానందం ఎలా ఉంటుందో తెలియకున్నా ఇక ఇంతకన్నా ఆనందం అనుభవించలేము అనిపిస్తుంది. పాటలలోని చిలిపి శృంగారం గిలిగింతలు పెడుతుంది. ఇంత ఆనందం మనసు భరించలేదేమో! ననిపిస్తుంది, ఒకోసారి పాటలు వింటూ, ఆనందం అనుభవిస్తూ ఏవేవో అందని లోకాలలో మనసు అలవి కాని మైమరుపుతో విహరిస్తూంటే.

కళ పరమార్థం ఇదే. సామాన్యుడిలో సైతం నిద్రాణస్థితిలో ఉన్న నాజూకయిన అనుభూతులను జాగృతం చేసి, అసామాన్య భావాలను కలిగించటం కళ లక్ష్యం. కొట్టండి, తన్నండి, చంపండి, విరగ్గొట్టండి, కాల్చేయండి, కూల్చేయండి వంటి భావాలతో ఆవేశం, ఎంత సమంజసమైనదైనా మనిషిలోని పశువును, జాగృతం చేస్తాయి. కానీ రసబంధురమయిన మధుర గీతాలు మనిషిలోని సున్నితత్వాన్ని జాగృతం చేస్తాయి. అతడిలోని దైవత్వ భావనను గుర్తించేందుకు మార్గదర్శనం చేస్తాయి. చైతన్యవంతుడిని చేస్తాయి, సినిమాలోని ప్రేమగీతాల ద్వారా కవులు, సంగీత దర్శకులు, గాయనీగాయకులు ఈ పనిని సమర్థవంతంగా నిర్వహించారు. అందుకే ఎలాంటి పాషాణ హృదయుడయినా పాత పాటలు వింటూ కరిగి రసప్రవాహమై పోతాడు వయసుతో సంబంధం లేకుండా. అందుకే సృజించి ఎన్నేళ్లయినా ఇప్పటికీ తాజాదనంతో నవనవలాడుతూ వృద్ధులకు యవ్వనానుభూతులను తాజా చేస్తూ, యువకులకు శృంగారానుభూతిలోని సున్నితత్వాన్ని అనుభూతికి తెస్తూ ఆనంద ఆవిష్కరణ చేస్తూ తరతరాలుగా చిరంజీవులుగా నిలుస్తూ సమాజాన్ని ప్రభావితం చేస్తున్నాయి.

*(వచ్చే నెలలో మరిన్ని మధురమైన పాటలు)*

Post your comments